భారత్‌లో నిరుద్యోగం.. కారణాలు

అభివృద్ధి స్థాయితో సంబంధం లేకుండా... ప్రతి ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగ సమస్య ఉంటుంది. నేర్పరితనం లేని శ్రామికులలోనే కాకుండా విద్యావంతులైన, శిక్షణ పొందిన వారిలోనూ నిరుద్యోగం ఉంటుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల నిరుద్యోగ సమస్య... అభివృద్ధి చెందుతున్న దేశాల నిరుద్యోగ సమస్యకు భిన్నమైంది!!

నిరుద్యోగం రెండు రూపాలలో ఉంటుందని ఆధునిక అర్థశాస్త్ర పితామహుడు కీన్స్ అభిప్రాయపడ్డారు. అవి అయిచ్ఛా పూర్వక (involuntary unemployment) నిరుద్యోగం, తాత్కాలిక ఘర్షిత నిరుద్యోగం. ఆర్థిక వ్యవస్థలో తాత్కాలిక ఘర్షిత నిరుద్యోగం ఏర్పడడానికి సార్థక డిమాండ్ లోపించడం కారణం.. కాగా అయిచ్ఛా పూర్వక నిరుద్యోగం రూపు మాపడానికి సార్థక డిమాండ్ పెంపొందించాలి. అభివృద్ధి చెందిన దేశాలలో... పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా సార్థక డిమాండ్ పెంచే చర్యలు చేపట్టవచ్చు. వెనుకబడిన దేశాలలో మూలధన కొరత వల్ల పెట్టుబడులు పెరగక.. ప్రస్తుతమున్న వేతనరేటుకే పని చేయడానికి ప్రజలు ఇష్టపడతారు. భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగిత, అల్ప ఉద్యోగిత కనిపిస్తాయి. గ్రామీణ ప్రాంతాలలో సరైన ఉపాధి లభించని ప్రజలు, పట్టణ ప్రాంతాలకు వలస రావడం వల్ల పట్టణాలలో నిరుద్యోగిత పెరుగుతోంది. పట్టణాల విషయంలో విద్యావంతులు కానివారి కన్నా... విద్యావంతులలో నిరుద్యోగం ఎక్కువ. ఒక సంవత్సరంలో... ఒక వ్యక్తి రోజుకు 8 గంటల చొప్పున 273 రోజులు పని కలిగి ఉన్నట్లయితే.. ఆ వ్యక్తికి ఉద్యోగిత ఉన్నట్లు చెప్పవచ్చు.

నిరుద్యోగం.. కారణాలు :

భారత్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో.. ప్రచ్ఛన్న నిరుద్యోగం, రుతు సంబంధ నిరుద్యోగం కనిపిస్తాయి. వ్యవసాయ కార్యకలాపాలు కొన్ని రుతువులకే పరిమితం. మిగతా రుతువులలో వ్యవసాయ కార్మికులు ఎలాంటి ఉపాధి లభించక, ఖాళీగా ఉండే స్థితిని రుతుసంబంధమైన నిరుద్యోగం అంటారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశ్రామిక, సేవా కార్యకలాపాలు విస్తరించకపోవడంతో చాలామంది తమ జీవనోపాధి కోసం వ్యవసాయ రంగాన్ని ఆశ్రయిస్తున్నారు. వ్యవసాయ రంగంలో అవసరానికి మించి శ్రామికులు ఉన్న స్థితిని ప్రచ్ఛన్న నిరుద్యోగం అంటారు. అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి ఆర్థిక వ్యవస్థలలో ఉన్న నిరుద్యోగాన్ని... నిర్మాణాత్మక నిరుద్యోగం అని



పేర్కొనవచ్చు.ఈ దేశాలలో మూలధనం, సాంకేతిక పరిజ్ఞానం కొరత కారణంగా... అన్ని రంగాలలో ఉత్పాదక సామర్థ్యం లోపించడంతో ఇటువంటి నిరుద్యోగం ఏర్పడుతుంది. మన దేశంలోని పట్టణ ప్రాంతాలలో పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించకపోవడం.. స్వయం ఉపాధి పథకాలకు ప్రోత్సాహం లేకపోవడం వల్ల విద్యావంతులలో నిరుద్యోగిత పెరుగుతుంది. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థల్లో తరచుగా ఆర్థిక మాంద్యం, తిరోగమనం సంభవిస్తుంటాయి. ఆయా కాలాలలో వ్యాపార కార్యకలాపాలు స్తంభించడంతో ఏర్పడే నిరుద్యోగాన్ని చక్రీయ నిరుద్యోగం అంటారు.

ఘర్షిత నిరుద్యోగం:

శ్రామిక శక్తి ఒక వృత్తి నుంచి మరొక వృత్తికి మారినప్పుడు.. శ్రామిక మార్కెట్‌లో నెలకొనే ఒడిదొడుకుల కారణంగా అభివృద్ధి చెందిన దేశాలలో ఏర్పడే నిరుద్యోగాన్ని... కీన్స్ తాత్కాలిక ఘర్షిత నిరుద్యోగంగా వర్ణించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో చోటు చేసుకుంటున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఉత్పత్తిలో శ్రమ సాంద్రత తగ్గి... మూలధన సాంద్రత పెరగడంతో ఏర్పడే నిరుద్యోగాన్ని సాంకేతిక పరమైన నిరుద్యోగంగా భావించవచ్చు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు..వనరుల కొరత, వాటి అల్ప వినియోగం లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మన దేశంలో వనరుల సమర్థ వినియోగం లేకపోవడంతో.. అల్ప ఆర్థికాభివృద్ధి చోటు చేసుకొని, ఉపాధి పెరుగుదల సంభవించలేదు. మూలధన సంచయనం తగ్గడం వల్ల వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో వృద్ధి జరగలేదు. నీటిపారుదల, విద్యుత్, ఎరువులు వంటి వ్యవసాయ ఉత్పాదితాలు తక్కువగా లభ్యమవుతున్నందు వల్ల వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకత తగ్గి... అదనపు ఉపాధి కల్పనలో తగ్గుదలకు దారి తీసింది. అవస్థాపన సౌకర్యాల కొరత కూడా పారిశ్రామికాభివృద్ధి తగ్గుదలకు కారణమై... ఉపాధి అవకాశాల పెరుగుదల సంభవించలేదు.

పెరిగిన శ్రామిక శక్తి:

1951 తర్వాత ప్రణాళికా యుగంలో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ప్రవేశపెట్టిన అనేక స్వయం ఉపాధి, వేతన ఉపాధి పథకాలు సత్ఫలి

తాలనివ్వలేదు. కొంతకాలం క్రితం వరకూ ప్రణాళికా వ్యూహంలో నిరుద్యోగ సమస్య అంతర్భాగం కాలేదు. జనాభా పెరుగుదల వేగవంతమై, శ్రామికశక్తి లభ్యత పెరిగినప్ప టికీ... మూలధన సంచయనానికి అవసరమైన వనరులు తగ్గాయి. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ఇచ్చినప్పటికీ... కార్యాచ రణలో అవి విఫలమవుతున్నాయి. మన దేశంలోని లోపభూ యిష్టమైన విద్యావిధానం.. ఉపాధి అవకాశాల పెరుగుదలకు దోహద పడలేదు. ప్రభుత్వ పథకాలు, నిరుద్యోగ నిర్మూలనకు సంబంధించి స్వల్పకా లిక ప్రయోజనాలు అందించాయి. అంతేకాని, దీర్ఘకాలిక ప్రయోజ నాలు చేకూర్చడంలో అవి విఫలమయ్యాయి.

వనరుల పంపిణీ:

ప్రపంచీకరణ నేపథ్యంలో...పెరిగిన పోటీతత్వానికి అనుగు ణంగా విద్యా ప్రమాణాలు మెరుగవకపోవడం... తద్వారా నైపుణ్యమున్న శ్రామికులు తయారు కాకపోవడంవల్ల ఉత్పత్తి, ఉత్పాదకత తగ్గి.. ఉపాధి అవకాశాలు మరింత జఠిలమయ్యాయి. ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా అమలవుతున్న పంచవర్ష ప్రణాళికలలో నిరుద్యోగ నిర్మూ లన కార్యక్రమాలకు సంబంధించి వనరుల పంపిణీ సక్రమంగా జరగ లేదు. నిరుద్యోగ నిర్మూలనకు దీర్ఘకాలిక వ్యూహాలైన భూసంస్కరణల అమలు, జనాభా నియంత్రణ లాంటి చర్యలు ఆచరణలో విఫల మయ్యాయి.

అహ్లూవాలియా నివేదిక:

ఉపాధి అవకాశాలపై మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా అధ్యక్షతన ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్.. జూలై 1, 2001న తన నివేదికను ప్రణాళికా సంఘానికి సమర్పించింది. ఈ నివేదిక ఆర్థికవేత్తలు, విధాన నిర్ణేతలు, కార్మిక నేతల విమర్శలకు గురయింది. వ్యవసాయ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను వేగవంతం చేయాలని.. కార్పొరేట్ రంగంలో సమీ కృత వ్యవసాయ కాంప్లెక్స్‌లు, ఫుడ్‌పార్క్‌లు అభివృద్ధి చేయాలని... బహుళజాతి సంస్థలను ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలలో ప్రోత్సహిం చాలని.. నిర్మాణ రంగం, రిటైల్ వాణిజ్యం, రోడ్డు రవాణాలో పెద్ద సంస్థలను ప్రోత్సాహించాలని టాస్క్‌ఫోర్స్ సూచించింది. ఉపాధి కల్పన బాధ్యత కార్పొరేట్ రంగానికి ఇవ్వాలని.. చిన్న తరహా పరిశ్ర మలకు సంబంధించి dereservation విధానాన్ని వచ్చే నాలుగు సంవత్సరాలలో అమలు చేయాలని టాస్క్‌ఫోర్స్ అభిప్రాయపడింది. ఈ చర్యలన్నీ దేశంలో మూలధన సాంద్రత పద్ధతులు పెరగడానికి దోహదపడతాయని.. తద్వారా నిరుద్యోగ సమస్య మరింత జఠిలమ వుతుందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు.

11వ పంచవర్ష ప్రణాళిక:

ఉద్యోగితా నాణ్యతను మెరుగుపరచడం ద్వారా ఉపాధి అవకాశాలను వేగవంతం చేయాలని 11వ ప్రణాళిక లక్ష్యంగా నిర్ణయించింది. మొత్తం ఉద్యోగితలో.. తాత్కాలిక ఉద్యోగిత ను తగ్గించి, శాశ్వత ఉద్యోగిత పెంచాలని భావించింది. అల్ప ఉద్యోగితను తగ్గించడం ద్వారా.. వ్యవసాయ రంగంలోని మిగులు శ్రామికులను, వ్యవసాయే తర రంగాలకు తరలించాలని ఈ ప్రణాళిక పేర్కొంది. ఈ ప్రణాళిక కాలంలో వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు పెరగకపోవ చ్చని.. తయారీ రంగంలో 4%, నిర్మాణ రంగంలో 8.2%, రవాణా, సమాచార రంగంలో 7.6% ఉపాధి వృద్ధిరేటు ఉంటుందని అంచనా. 11వ ప్రణాళికలో మొత్తం శ్రామికశక్తిలో 45 మిలియన్ల పెరుగుదల ఉంటుందని, మొత్తం 58 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు సృష్టించగలమని ప్రణాళికా సంఘం పేర్కొంది. శ్రామిక శక్తిలో పెరు గుదల అంచనా కన్నా ఎక్కువగానే ఉండే అవకాశముంది. నైపుణ్యాలు పెంచే కార్యక్రమాలను అన్ని స్థాయిల్లో చేపట్టడంతోపాటు వీటి లోపా లను ఈ ప్రణాళికా పత్రం పేర్కొంది. శిక్షణను పెంపొందించడం ద్వారా పరిశ్రమ, వాణిజ్యం, సేవా రంగానికి అవసరమైన సంఖ్యలో శ్రామికులను అందించాలని ప్రణాళిక లక్ష్యంగా నిర్ణయించింది.ఉపాధి విస్తరణకు ఈ విధమైన మద్దతు లభించినట్లయితే... వ్యవసాయ రంగంలోని మిగులు శ్రామికులను, వ్యవసాయేతర రంగాలకు బదిలీ చేయవచ్చు!! .